TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 77 గురువారం 16-07-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు- 4 వేల :6.00/-

## రామాలయ సీఈవో పోస్టుకు వెయ్యికి పైగా దరఖాస్తులు



అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ నూతన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించగా, కొద్ది రోజుల వ్యవధిలోనే వెయ్యికిపైగా అప్లికేషన్లు అందాయి. సీఈవోను ఎంపిక చేసేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రమోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ విశ్వకాంత్ చతుర్వేది, రిటైర్డ్ అణుశాస్త్రవేత్త సురేష్ హవారేలతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 18 చివరి తేదీ.

# మునుగోడు గడ్డ... తెలంగాణ మాధవక్క అడ్డ



**మునుగోడు న్యూస్: జూలై 15 నవ సంఘర్షణ**
తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఈరోజు తెలంగాణ రాష్ట్రం లోని 23 నియోజకవర్గాలకు ఇంచార్జిలను ప్రకటించడం జరిగింది. ఈ నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గానికి తెలంగాణ మాధవక్క పేరును ప్రకటించడం, బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ కోసం ప్రజా సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు, నాపై నమ్మకంతో,నేను చేసినటువంటి సేవలను గుర్తించి,నాకు సరైన గౌరవం కల్పించినటువంటి కల్వకుంట్ల కవితకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నానని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని,రానున్న రోజుల్లో అధికారంలోకి వచ్చేందుకు తమ వంతుగా పోరాటం చేస్తానని మాట్లాడారు. అనేక రకాలుగా నాకు ప్రోత్సాహం కల్పించి, వెన్నుదన్నుగా నిలబడి, ఈ గొప్ప బాధ్యత అవకాశం కల్పించిన కల్వకుంట్ల కవితకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. మునుగోడు నియోజకవర్గంలో ఎన్ని శక్తులు అడ్డొచ్చిన తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాను ఎగురవేసి తీరుతామని తెలంగాణ మాధవక్క శపథం చేశారు.

TRS
తెలంగాణ రక్షణ సేన
TELANGANA RAKSHANA SENA

### సీఎం రేవంత్ రెడ్డికి
## పవన్ కల్యాణ్ లేఖ



- షాబాద్ ఘటనపై పవన్ కల్యాణ్ లేఖ
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం
- పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ
- బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

2 లో

## విరుచుకుపడ్డ అమెరికా!



- ఇరాన్ మిలిటరీ ఫెసిలిటీలు, తూంబ్ దీవిపై భీకర దాడులు
- కొన్ని గంటలపాటు ఏకబిగిన అటాక్.. నిన్న ఉదయం కూడా కొనసాగింపు
- ఇటీవలి దాడుల్లో 35 మంది మృతి.. 300 మందికి గాయాలు
- హోర్ముజ్ నుంచి గల్ఫ్ ఎగుమతులు బంద్: ఇరాన్

2 లో



### నేటి నుంచి బోనాల
## మహోత్సవం

- గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో ఆరంభం..
- ఆగస్టు 13 వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు
- రూ.20 కోట్లతో ఘన ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం..
- 3 వేలకుపైగా దేవాలయాల్లో వైభవంగా నిర్వహణ
- అమ్మవారి కరుణతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ జూలై 15 నవ సంఘర్షణ**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే ఆషాడ బోనాల మహోత్సవాలు గురువారం (జూలై 16) నుంచి ఘనంగా ప్రారంభం కానున్నాయి. గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు ఆగస్టు 13న హరిబోలోని అక్కన్న--మాదన్న మహంకాళి ఆలయంలో బోనాల సమర్పణ, ఘటాల నిమజ్జనంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక ఉత్సవమే కాకుండా శతాబ్దాల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. ప్రజల జీవన విధానం, సామాజిక ఐక్యత,

-మిగతా 2 లో

### విద్యారంగ ప్రక్షాళనే
# ధ్యేయం

### అక్షరమే అభివృద్ధికి తొలిమెట్టు: సీఎం రేవంత్‌రెడ్డి

- గత పాలకుల నిర్లక్ష్యంతో నిర్వీర్యమైన విద్యావ్యవస్థ
- విద్యార్థుల భవిష్యత్తుకు నాది హామీ
- ఆగస్టు నుంచి 9 వస్తువుల పంపిణీ గ్యారంటీ
- క్రీడల్లో రాణించే వారికి ప్రభుత్వ చేయూత
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో విద్యా ప్రమాణాల పెంపు
- కొత్తకోటలో పాఠశాల భవనాల ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

తరగతి గదుల్లోనే తెలంగాణ భవిష్యత్ నిర్మాణం జరుగుతుందని, విద్యారంగ ప్రక్షాళనతో ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆగస్టు నుంచి 25.5 లక్షల మంది విద్యార్థులకు తొమ్మిది వస్తువులను గ్యారంటీగా అందజేస్తామని హామీ ఇస్తూ, విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల సంక్షేమం, క్రీడాకారులకు ప్రోత్సాహం కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు."

**మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి జూలై 15 నవ సంఘర్షణ**
'తరగతి గదిలోనే నిజమైన తెలంగాణ నిర్మాణం జరుగుతుంది. అక్షరమే అభివృద్ధికి తొలిమెట్టు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందలేదు. అందుకే విద్యాశాఖను తన దగ్గర పెట్టుకున్నా. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రాన్ని చదువులో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని

-మిగతా 2 లో





### పార్లమెంట్‌లో 'స్మార్ట్'
## పరికరాలు వాడొద్దు

- ఎంపీలకు లోక్‌సభ సచివాలయం సూచన

2 లో



2 లో

### 100 శాతం పెట్రోలే కావాలంటే.. ఎక్కువ ధర చెల్లించాల్సిందే

- వాహనదారులకు స్పష్టం చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



## యూరియాపై కేంద్రం గురి!

- దేశీయంగా మరో 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి టార్గెట్
- రూ.62,500 కోట్ల మొబైల్ పీఎల్ఐ 2.0కు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ. 1.27 లక్షల కోట్లతో సెమీకండక్టర్ మిషన్ 2.0 కూడా

2



### పీవోకేలో భగ్గుమన్న
## నిరసన జ్వాలలు

- పాక్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భారీ లాంగ్ మార్చ్
- రావల్ కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు నిరసనకారుల కదం
- గడువు ముగియడంతో తీవ్రతరం కానున్న ఆందోళనలు
- 38 డిమాండ్ల సాధనకై జేఏఏసీ పిలుపు

2 లో

# ఉపాధ్యాయ ఉద్యోగులకు పీఆర్సి, డీఏ వెంటనే అమలు చేయాలి.



ఇటికాల రవీందర్
ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

**భువనగిరి జూలై 15 నవ సంఘర్షణ**
భువనగిరి మండలంలోని వివిధ పాఠశాలలలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు బోయ రాములు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం పీఆర్సి డీఏ వెంటనే అమలు చేయాలని అలాగే సీపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలి అని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ రాములు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని అలాగే ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు హైయర్ ఎడ్యుకేషన్ చేయుటకు సంబంధించిన జి ఒ 342 అమలుకు అడ్డంకిగా ఉన్న మెమో నెంబర్ 26659 రద్దు చేయాలని కోరుతూ అలాగే పదోన్నతులలో అడ్డంకిగా ఉన్న ఆడక్వసీ అనే పదాన్ని రద్దు చేసి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు అండాలు రవికుమార్ విజయ బాలకృష్ణ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# శిరివెళ్ల ఈఓగా బాధ్యతలు చేపట్టిన నరసింహ



**శిరివెళ్ళ. జూలై 15 నవ సంఘర్షణ**
మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ ఈఓగా టి నరసింహ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇన్చార్జి ఈవో గా బాధ్యతలు నిర్వహించిన డిప్యూటీ ఎంపీడీవో అశ్విన్ కుమార్ టీ నరసింహ పదవి బాధ్యతలు అప్పగించి శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ భౌగోళిక పరిస్థితులను మౌలిక వసతులను పారిశుధ్యం డ్రైనేజీ డ్రింకింగ్ వాటర్ తదితర అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఈఓ నరసింహ మాట్లాడుతూ మేజర్ గ్రామపంచాయతీలో ఎక్కడైనా పారిశుద్ధ్య లోపం గాని నీటి సమస్య గాని డ్రైనేజీ సమస్య ఉంటే శిరివెళ్ల గ్రామపంచాయతీలో గల కంప్లైంట్ రిజిస్టర్ బుక్ లో ఎంట్రీ చేసి తమ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. మేజర్ గ్రామపంచాయతీ లో 100% పన్ను వసూళ్లకు కృషి చేస్తానని నూతన భవనం నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించి చేయూతనివ్వాల్సిన అవసరం ఉందని నూతన ఈఓ నరసింహా తెలియజేశారు.

# ట్రాక్టర్ ప్రమాదంలో ధ్వంసమైన మోటార్ సైకిల్.

**-శిరివెళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన రిపోర్టర్.**




**శిరివెళ్ళజూలై 15 నవ సంఘర్షణ**
మండల కేంద్రంలోని కాపు పేటకు చెందినటువంటి గంతి వెంకటసుబ్బయ్య అను విలేకరి ట్రాక్టర్ ప్రమాదంలో తను తృటిలో తప్పించుకొని ప్రాణాలతో బయటపడగా మోటార్ సైకిల్ ధ్వంశమైన సంఘటనలో ఆయన బుధవారం శిరివెళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మోటార్ సైకిల్ మరమ్మత్తులకు గురి అయినప్పటికీ ప్రమాదానికి కారణమైన వారు స్పందించకపోగా దురుసుగా ప్రవర్తించడం పట్ల విలేకరి ఆవేదన వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణం అయిన ట్రాక్టర్ను సీజ్ చేసి న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు.

# చిన్నారుల భద్రతకు శక్తి టీం అవగాహన

**గుడ్ టచ్--బ్యాడ్ టచ్, 112, శక్తి యాప్‌పై విద్యార్థులకు వివరాలు**



**నందికొట్కూరు, జూలై 15 నవ సంఘర్షణ**
చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షియోరాన్ ప్రత్యేక చొరవతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు ఆత్మకూరు సబ్‌డివిజన్ శక్తి టీం సభ్యులు మంగళవారం నందికొట్కూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ రెడ్డి అనుమతితో, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సమక్షంలో 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. అపరిచితులు చాక్లెట్లు, బిస్కెట్లు, బొమ్మలు ఇస్తామని చెప్పి దగ్గరకు పిలిచినా వెళ్లవద్దని, వెంటనే ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాల సిబ్బందికి శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఫొటోలు, లొకేషన్‌తో పోలీసులకు ఎలా పంపించాలో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే తక్షణమే పోలీసు సహాయం అందుతుందని తెలిపారు. చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి పాఠశాలలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసు శాఖ చొరవను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు. ఎస్పీ సునీల్ షియోరాన్ చేపట్టిన ఈ కార్యక్రమం చిన్నారుల్లో అప్రమత్తత పెంచడంలో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# టీటీడీకి రూ.2 కోట్ల విరాళం

**శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి భారీ సాయం**

**చెరో రూ.కోటి అందించిన బయోఫోర్ సంస్థ ప్రతినిధులు**



**తిరుమల,జూలై 15 నవ సంఘర్షణ**
తిరుమల తిరుపతి దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు రూ.2 కోట్ల భారీ విరాళం అందించారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి ఈ విరాళాన్ని సమర్పించారు. సంస్థ సీఈఓ జగదీష్, సీఎస్ఓ మాణిక్ రెడ్డి పుల్లగూర్ల బుధవారం చెరో రూ.కోటి చొప్పున విరాళంగా అందజేశారు. ఈ మేరకు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్. నాయుడుకు రూ.2 కోట్లకు సంబంధించిన డీడీలను అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు ఏ. రంగశ్రీ పాల్గొన్నారు.

# ఆకుల రమేష్ గౌడ్ సేవలు చిరస్మరణీయం..




**ఎల్బీనగర్, జూలై 15 నవ సంఘర్షణ**
ఎల్బీనగర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, దివంగత నాయకుడు ఆకుల రమేష్ గౌడ్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ రింగ్ రోడ్‌లో బుధవారం ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొని, ఆకుల రమేష్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆకుల రమేష్ గౌడ్ ప్రజల పట్ల అంకితభావంతో పనిచేసిన గొప్ప ప్రజానాయకుడని పేర్కొన్నారు. సమాజ సేవకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలు, సేవా స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ఆకుల రమేష్ గౌడ్ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాసేవను మరింత విస్తృతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

# ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళులు

**కాపు సమాజానికి తీరని లోటు: శిల్పా మోహన్ రెడ్డి**



**నంద్యాల ప్రతినిధి జూలై 15 నవ సంఘర్షణ**మాజీ మంత్రి, కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం మృతి కాపు సమాజానికి తీరని లోటని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ముద్రగడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఆయన, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ముద్రగడ కోలుకుని తిరిగి వస్తారని ఆశించామని, ఆయన మరణం తీవ్ర విషాదకరమని అన్నారు. ముద్రగడ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన పోరాట స్ఫూర్తి, ఆశయాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కాపు సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన నాయకుడిగా ముద్రగడ సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

# పదోన్నతి పొందిన ఎక్సైజ్ అధికారులకు ఘన సన్మానం

**-జఫ్రుల్లా, కృపవర కుమారుకు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అభినందనలు..**

**- నిజాయితీ సేవలకు ప్రశంసలు**




**నందికొట్కూరు, జూలై 15 నవ సంఘర్షణ**
నందికొట్కూరు డివిజన్ ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ సీఐగా పదోన్నతి పొంది డోన్‌కు బదిలీ అవుతున్న జఫ్రుల్లాతో పాటు, హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎస్సైగా పదోన్నతి పొంది కోడుమూరుకు బదిలీ అవుతున్న కృపవర కుమారును నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు నాయక్, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ జఫ్రుల్లా నందికొట్కూరులో అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణాను అరికట్టడంలో ఆయన చూపిన చిత్తశుద్ధి, నిబద్ధత అభినందనీయమన్నారు. కానిస్టేబుల్‌గా ఇదే నందికొట్కూరులో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన జఫ్రుల్లా అంచెలంచెలుగా ఎదిగి నేడు సీఐ స్థాయికి చేరడం శాఖకే గర్వకారణమని పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని జఫ్రుల్లా నిరూపించారని, ఆయన సేవలను నియోజకవర్గ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని ఎమ్మెల్యే అన్నారు. డోన్‌లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేసి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఎస్సైగా పదోన్నతి పొంది కోడుమూరుకు బదిలీ అవుతున్న కృపవర కుమారును కూడా ఎమ్మెల్యే అభినందించారు. నూతన బాధ్యతల్లోనూ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.అనంతరం ఎమ్మెల్యే గిత్త జయసూర్య, సీఐ రామాంజనేయులు నాయక్, హెడ్ కానిస్టేబుల్ నాయక్‌తో కలిసి ఇద్దరు అధికారులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పగిడ్యాల మండల టీడీపీ కన్వీనర్ పలుచాని మహేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జమీల్, నందికొట్కూరు మండల ఉపాధ్యక్షులు పబ్బతి జ్యోతి రవికుమార్, ఎక్సైజ్ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో సర్ గడువు పొడిగింపు




**హైదరాబాద్ జూలై 15 నవ సంఘర్షణ**
తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఆగస్టు 3 వరకు ఎన్యూమరేషన్ ఫారాలను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాల స్వీకరణ చేపట్టనుంది. అభ్యంతరాలపై విచారణకు అక్టోబర్ 8 వరకు ఇసిఐ తుది గడువు విధించింది. ఇప్పటికే ఎపిలో సర్ గడువును ఈనెల 24 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే.

# జక్కనతో 14 నెలల ప్రయాణం..

## -స్లో మోషన్ జంప్స్..
## 'వారణాసి' సీక్రెట్స్ లీక్ చేసిన ప్రియాంక!




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న భారీ విజువల్ వండర్ 'వారణాసి'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో, చిత్ర కథానాయిక ప్రియాంక చోప్రా చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ప్రాజెక్ట్ కోసం గత 14 నెలలుగా పనిచేస్తున్నట్లు తెలిపిన ఆమె, రాజమౌళి ప్రతి సన్నివేశాన్ని ఎంతో క్లారిటీతో, పకడ్బందీగా తెరకెక్కిస్తారని కొనియాడారు. ఈ సినిమా కోసం తాను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ కూడా చేసినట్లు పేర్కొంటూ, అంతకు మించి వివరాలను మాత్రం ప్రస్తుతానికి వెల్లడించలేనని తెలిపారు. అయితే ప్రియాంక చేసిన ఈ స్లో మోషన్ జంప్స్ ఏ యాక్షన్ సీక్వెన్స్‌లో భాగం అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయినట్లు దర్శకుడు రాజమౌళి ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు అన్నపూర్ణ స్టూడియోస్‌లో వేసిన భారీ సెట్లలో ఆఖరి నిమిషం షూటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జక్కన బృందం వీలైనంత త్వరగా చిత్రీకరణను ముగించి, అంతర్జాతీయ స్థాయిలో సినిమాను ప్రమోట్ చేయడానికి పక్కా యాక్షన్ ప్లాన్‌తో సిద్ధమవుతోంది. కాగా, ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. దుర్గా ఆర్ట్స్ పతాకంపై సీనియర్ నిర్మాత కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మహేశ్ బాబు 'రుద్ర'గా, ప్రియాంక చోప్రా 'మందాకిని'గా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే శక్తివంతమైన విలన్ పాత్రలో కనిపించనున్నారు. సీనియర్ నటుడు ప్రకాష్ రాజ్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



## కేతిక శర్మ అందాలు కెవ్వు కేక..

# ఓటీటీలోకి వచ్చేస్తోన్న క్రేజీ యాక్షన్ డ్రామా 'పళ్లిచట్టంబి'!



'పళ్లిచట్టంబి'.. ఈ పేరు వినగానే తెలుగు ఆడియన్స్‌కు ముందుగా స్ట్రైక్ అయింది 'పల్లీ చట్నీ'. అవును, ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేసినప్పుడు తెలుగువాళ్లంతా ఇలాగే అవాక్కయ్యారు. ఏంటి.. తెలుగులో పెట్టడానికి నిర్మాతలకు ఇంతకంటే మంచి పేరు దొరకలేదా? అంటూ సోషల్ మీడియాలో మీమ్స్‌తో ఆటాడుకున్నారు. కానీ, కట్ చేస్తే.. కంటెంట్ ఉన్న సినిమాకి టైటిల్స్ అడ్డుకావని ఈ చిత్రం నిరూపించింది. కేరళ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ, బాక్సాఫీస్ వద్ద మోస్తరు విజయాన్ని అందుకొని విమర్శకుల ప్రశంసలు సైతం సొంతం చేసుకుంది. ఇక థియేటర్లలో ఈ టైటిల్ వెరైటీని చూసి మిస్ అయిన వారి కోసం ఈ చిత్రం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై వచ్చేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'సోనీ లివ్' లో జులై 24 నుండి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి అందుబాటులోకి రాబోతోంది.సినిమా కథ విషయానికి వస్తే.. 1957 నాటి కేరళ భూసంస్కరణల బిల్లు నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. చర్చి భూములను కాపాడటం కోసం 'పోతన్ క్రిస్టోఫర్' (టొవినో థామస్) అనే యువకుడిని చర్చి రక్షకుడిగా (చట్టంబి) నియమిస్తారు. అయితే, అతని అసలు పేరు కృష్ణ పిళ్లై. ఒక హిందూ యువకుడైన కృష్ణ పిళ్లై, మారుపేరుతో చర్చిలోకి ఎందుకు అడుగుపెట్టాడు? కమ్యూనిస్ట్ భావజాలం ఉన్న రెబెక్కా (కయాదు లోహర్)తో అతని ప్రేమాయణం ఎలా సాగింది? అనే ఆసక్తికరమైన అంశాలతో ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాను దర్శకుడు డిజో జోస్ ఆంటోని తెరకెక్కించారు.

# అప్పుడు తండ్రితో.. ఇప్పుడు కొడుకుతో..!

## ఆ స్టార్ హీరో సినిమాలో నయన తార.?

సినిమా ఇండస్ట్రీలో 22ఏళ్లుగా తిరుగులేని స్టార్ డమ్ సొంతం చేసుకుంది లేడీ సూపర్ స్టార్ నయన తార. కెరీర్ బిగినింగ్లో ఈ అమ్మడు చిన్న చిన్న పాత్రలు సెకండ్ హీరోయిన్ రోల్స్ చేసింది. రజినీకాంత్ నటించిన చంద్రముఖి, సూర్యతో కలిసి గజినీ సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా నటించినా ఆతర్వాత మెయిన్ హీరోయిన్ గా మారి బ్లాక్ బస్టర్స్ అందుకుంటుంది. అంతే కాదు స్టార్ హీరోలకు సమానంగా రెమ్యునరేషన్ అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు, తమిళ్ హిందీ భాషల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది అందాల భామ. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతుంది. ప్రస్తుతం నయన్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్ గా రాణిస్తుంది.రీసెంట్ గా మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన మన శంకర వరప్రసాద్ గారు సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ఈ హిట్ తో నయన్ పేరు మరోసారి టాలీవుడ్ లో మారుమ్రోగుతుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా సూపర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం నయన్ ఒక్కో సినిమాకు రూ.25 నుంచి రూ.30 కోట్లు పారితోషకం తీసుకుంటుందని తెలుస్తుంది..ఇప్పటివరకు ఏ హీరోయిన్ సైతం ఇంతగా పారితోషికం తీసుకోలేదని ఇండస్ట్రీ టాక్. ఇదిలా ఉంటే ఇప్పుడు నయన్ ఓ స్టార్ హీరో సినిమాలో నటిస్తుందని తెలుస్తుంది. ఆ హీరో ఎవరో కాదు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. సుకుమార్, చరణ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న సినిమాలో నయనతార నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. రంగస్థలం లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్, సుకుమార్ కలిసి ఇప్పుడు ఓ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటివరకు ఎలాంటి అప్డేట్ రాలేదు. కానీ ఇప్పుడు ఈ సినిమా కోసం లేడీ సూపర్ స్టార్ నయనతారను రంగంలో దింపుతున్నారని తెలుస్తుంది. ఆమె ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తుందని టాక్ వినిపిస్తుంది. అలాగే చరణ్‌కు అక్కగా నటించే అవకాశం ఉందని గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై త్వరలోనే క్లారిటీ వస్తుందేమో చూడాలి.





# బేబీ బంప్‌తో సమంత.. 'నేనెప్పుడూ కోరుకున్న క్షణమిది' అంటూ ఎమోషనల్!

టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు త్వరలోనే తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత తన మొదటి సంతానానికి జన్మనివ్వబోతున్నట్లు సమంత అధికారికంగా ప్రకటించారు. ఇటీవల ఆమె కథానాయికగా నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. ఈ సినిమా విజయోత్సవ వేడుకల్లో సమంత బేబీ బంప్‌తో మెరిసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా తన ప్రెగ్నెన్సీ వార్తలపై స్పందిస్తూ, మాతృత్వాన్ని అనుభవిస్తున్న ఈ క్షణాల గురించి సమంత ఎంతో ఎమోషనల్‌గా మాట్లాడారు. ఈ సరికొత్త ప్రయాణం నాకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. నిజానికి నేను ఈ అద్భుతమైన క్షణం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నాను. జీవితంలో మాతృత్వాన్ని అందుకోవాలనేది నా చిరకాల కల. అందుకే ఈ కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడానికి నా వంద శాతం శ్రమిస్తాను' అని ఒక ఇంటర్వ్యూలో సమంత పేర్కొన్నారు. ప్రతి పనిని ఎంతో ఇష్టపడి చేసే తనకు, ఇప్పుడు తనలో సరికొత్త శక్తి, ఆలోచనలు మొదలయ్యాయని.. భవిష్యత్తులో రాబోయే మధురమైన రోజులను ఆహ్వానించేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని చెప్పారు.

# జూలై 23నే 'జననాయగన్' విడుదల?

## హింట్ ఇచ్చిన మేనేజర్!



తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ చివరి చిత్రంగా రాబోతున్న మోస్ట్ అవేటెడ్ పొలిటికల్ డ్రామా 'జననాయగన్' విడుదలపై ఎట్టకేలకు ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా జూలై 24న విడుదల కానుందని గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. అయితే అంతకంటే ఒక రోజు ముందుగానే జూలై 23న థియేటర్లలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు చిత్ర సహ నిర్మాత, విజయ్ వ్యక్తిగత మేనేజర్ జగదీష్ పళనిసామి సోషల్ మీడియా వేదికగా ఒక పెద్ద హింట్ ఇచ్చారు. ఈ సినిమా విడుదల తేదీపై ఆయన ఇచ్చిన హింట్‌తో దళపతి అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక అనౌన్స్‌మెంట్ పోస్టర్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.మరోవైపు, ఫైనల్ కట్‌లో కొన్ని కీలకమైన కొత్త సీన్లను యాడ్ చేయడం వల్ల ఈ సినిమా ఇటీవల మళ్లీ రీ-సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'ఊ' సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, సినిమాపై ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. త్వరలోనే విడుదల కానున్న పవర్‌ఫుల్ ట్రైలర్ సినిమా అంచనాలను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ పొలిటికల్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించింది.